వినోద రచన

వై. ఎస్. రావు.

# అనుకోండి

ఒకప్పుడు నా గురించి చాలా చాలా అనుకునే వాడ్ని. కాని కాలం మారుతున్న కొద్దీ, విజ్ఞానం అలవడుతున్న కొలదీ, నేను మొదట్లో అనుకున్న వాటిని మార్చుకునే ఈ "అనుకోవడం" అనే పదం, ఒకసారి నాకు పెద్ద విప్లవాన్ని కలుగ చేసింది. అనుకోవడం రెండు విధాలనుకుంటాను! ఒకటి, మనస్సులో అనుకుని, దాన్ని పైకి తెలియ పర్చడం. రెండు, మన మనస్సులోనే ఉంచుకోవడం. ఇందులో రెండవది కొంచెము ప్రమాదకరమైనదని నేననుకుంటాను. ఎందుకంటే ఒక వస్తువును గూర్చో లేక ఒక సంఘటను గురించో ఒక విధమైన అభిప్రాయాన్ని మన మనస్సులో అనుకుని, పైకి చెప్పక, దాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేక లోపల బాధ పడుతాము. నేను చెప్పేది పురాణం కాదండి. నా కళ్ళ ముందు, నా స్నేహితులు మొదలైన వారికి, ఆఖరికి నాకే, ఈ అనుకోవడం లోనే జరిగిన సంగతులు చెప్తాను వినండి.

"హల్లో! మీరేనా ఈ కళామందిరం డాన్సుటీచర్?" అని అన్నాడు, ఒకతను కారు తలుపు తోస్తూ బయటికి వచ్చి.

"నో, సారీ! నేను కాదండి! నేను మైలాపూర్ లేడీస్ క్లబ్ సెక్రటరీనండి" అన్నది, ఒక నడివయస్సు స్త్రీ వయ్యారంగా తల వూపుతూ"

"అరెరే! పొరపాటైంది క్షమించాలి. మీరు కళామందిరంనుండి బయటికి రావడం చూసి, మీరే డాన్సు టీచరయి వుండాలి అని అనుకున్నాను"

"అబ్బే దానికేం లెండి, ఫరవాలేదు. నమస్తే"

"పొరపాటుగా మిమ్మల్ని డాన్సు టీచరనుకొని పలుకరించాను, యిప్పట్నుండీ మనం పరిచయులం. నా కారులోనే మిమ్మల్ని మీ యింటిదాక దిగబెడతాను రండి" "థేంక్సు" అంటూ ఆమె కారులో కూర్చుంది. చూసారా! ఈ అనుకోవడం ఎంత గమ్మత్తైన పరిచయం చేసిందో. యిలాగే యింకా కొన్ని రకములైన అనుకోడాలు వున్నాయి.

యిద్దరు యువకులు ఒక రోడ్డుమీది పేవ్‌మెంట్ మీద సిగరట్లు కాల్చుకుంటూ యిలా మాట్లాడుకుంటున్నారు.

"ఒరేయ్ మూర్తీ, అటు చూడరా ..అటు . అటు"

"ఏం లేదే"

"ఏడిశావ్... వెధవా"

"అక్కడ ఏమీలేందే"

"ఏం లేదేమిటి నీ మొఖం...అదుగో వస్తున్న అమ్మాయిని చూడరా"

"ఆ! చూశాను చాలా బాగుందిరా"

"ఆ అదేరా ఎప్పుడు చూసినా, అలా తల వంచుకునే పోతుందిరా. ఒకసారైనా యిట్లు చూస్తుందేమో అని రోజూ యిక్కడే వుంటానురా. కాని ఏమి లాభం కనుపించదు.

"ఒరేయ్ నువ్వు యిక్కడే వుండు, నేను ఆ అమ్మాయితో మాట్లాడుతాను"

"ఆ అమ్మాయిని నువ్వు ఎరుగుదువురా!"

"అదంతా నీ కెందుకు చూస్తూ వుండు" అంటూ మూర్తి గబగబా, ఆమెను వెనకాలే సమీపించి, వెనకనుండే "ప్రభా, ప్రభా" అని అరుస్తూ ఆమె ముందు నిలబడ్డాడు. ఆ యువతి కళ్ళెఱ్ఱజేసి ముఖం చిట్లించింది.

మూర్తి చాల బాధపడ్డ వానివలె నటిస్తూ "అయ్యో మీరా, నా చెల్లెలు ప్రభ అచ్చంగా మీలాగే వుంటుందండి. కాకినాడకి వెళ్ళింది. మాకు తెలియపర్చకుండా వచ్చిందేమోనని భ్రమపడ్డాను. చాలా దగ్గరికి వస్తేగాని తేడా కనపడ

లేదు. వృథాశ్రమ కలిగించినందుకు క్షమించాలి" అన్నాడు రోజూకుంటూ.

ఆమె ముఖంలో వెంటనే ఒక చిరునవ్వు కనపడింది. "నిజంగా! మీ చెల్లెలు ప్రభ వాలాగే ఉంటుందాండి?"

"ప్రమాణంగా మీలాగే వుంటుదండి!"

"అలా అయితే ఈసారి మీరు మీ చెల్లెలు వస్తే నాకు తప్పక చూపాలి. అదుగో, అదే మా యిల్లు. నాకు కవలలన్నా లేక యిద్దరు స్త్రీలు ఒకే పోలికవున్నా చూడ్డానికి మహాసరదా."

"తప్పకుండాను మా చెల్లెలనుకొని మిమ్మల్ని దారిలో ఆపినందుకు క్షమించాలి"

"అయ్యో! దానికేమి లెండి. నన్ను కూడా మీచెల్లెలనే అనుకోండి." అంటూ ఆమె వెళ్ళిపోయింది.

మూర్తి తన స్నేహితుడ్ని విజయ గర్వంతో చూసి నవ్వేడు.

చూశారా యిక్కడ అనుకోవడం ఎలావుందో.

నేను వ్రాస్తూ, వ్రాస్తూ తలపైకెత్తి చూశాను. ఎదురుగుండా కూర్చొని చదువుకుంటూన్న నా చెల్లెలు, తలపైకెత్తి నాకేసిచూసి, చిటికె వేసింది.

"ఏమిటి సంగతి" అన్నాను. ఏమీ లేదు. యిందాక నాన్నగారు డబ్బిచ్చారే, దాంతోరేపు ఏ చీర కొందామా అని అనుకుంటున్నాను" అని అనేసి తలవంచుకొని చదువులో మునిగింది.

నేను నాలో నే నవ్వుకుంటూ మళ్ళీ ప్రారంభించాను. చూశారా ఈ అనుకోవడం నామీద కూడ దెబ్బతీసింది.

ఒక డైరక్టరు ఒక తారనుచూచి, యిలా అంటున్నాడు, "యిలా చూడండి. మీ అమ్మాయి కారు క్రింద పడిందని మీకు ఎవరాన్నా వార్త తెచ్చారనుకోండి! అప్పుడు మీరు ఎలా బయటకు పరుగాడతారు, కాస్త నటించి చూపండి" అని అన్నాడు.

ఈ అనుకోవడం ఒక్క చోటేమిటి, ఒక్క సందర్భమేమిటి, ఒక్క సంఘమునకేమిటి? అన్నిటిలోను వస్తుంది.

ఒక ఉపన్యాసి, ఉపన్యాసము ప్రారంభించే టప్పుడు "నన్ను గూర్చి మీరు వేరేవిధంగా అనుకోకుండా సావధానంగా నా ఉపన్యాసం విన ప్రార్థన" అని ప్రారంభిస్తాడు.

ఎవరైనా తమ పతిభక్తి యితరులకు చెప్పేటప్పుడు, "నేను బడాయి కొడుతున్నానని అనుకోకండి. నే చెప్పేది అంతా నిజంగా జరిగిందే" అని ముందుగానే అనుకోకండి అని ప్రారంభిస్తారు.

"ఏంటా! వెధవా నా గురించేమనుకున్నావ్"

"ఈ పిక్చర్ యింత చండాలంగా వుంటుందనుకోలేదు బ్రదర్"

"సార్ ఈ చీర ఎంత బాగుందను కున్నారు... మీ భార్యగారు తప్పకుండా దీన్ని బాగుందనే అంటారనుకుంటాను"

ఈ అనుకోవడం అనే పదం ప్రతి రోజు జీవితంలో ఏ వందసార్లన్నా ఒక్కొక్కరి నోటినుండి వస్తుంది. దీనిని వాడుతున్నప్పుడు కాస్త జాగ్రత్తగా వాడితే బాగుంటుంది. దీనిని చదివి మీరు నన్ను గురించి ఏమైనా అనుకోండి!

★

## కీ. శే. పత్తిపాటి రత్నమ్మగారు

శ్రీ న్యాయపతి సత్యనారాయణగారి ధర్మపత్నియు, ఆంధ్ర మహిళాసభ యావజ్జీవ సభ్యురాలును అగు శ్రీ పత్తిపాటి రత్నమ్మగారు, శ్రీ కృష్ణజయంతీ పర్వదినమున దివంగతులైరి. వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థించుచూ, వారి కుటుంబమునకును, యితర బంధుమిత్ర వర్గమునకును, 'ఆంధ్ర మహిళ' సానుభూతిని తెలియజేయుచున్నది.